

# శ్రీ కల్యాణీయం

## – సింగీతం లక్ష్మీ కల్యాణి



*విశేషమైన ఖ్యాతి గడించిన సినీదర్శకుడి భార్య ఐనప్పటికీ ,*

*సాధారణ గృహిణిగా ఎదుగుతూ*

*కుటుంబాన్ని అందంగా తీర్చిదిద్దుకున్న ఓ మహిళ స్ఫూర్తిదాయకమైన ఆత్మకథ..!!*

*(గత సంచిక తరువాయి)*

**విశాఖపట్నంలో** మావారి వైపు బంధువులు చాలామంది ఉన్నారు. అందరూ సింగీతంవారే, సింగీతం వారి వియ్యంకులు విజాపురపు వాళ్ళు. మా శకుంతల పెళ్ళి అయిన తరువాత విశాఖపట్నంలోని మా ఆడపడుచు కొడుకు పెళ్ళి శ్రీకాకుళంలో జరిగింది. దానికి నేనూ, మా సేతమ్మక్క వెళ్ళి పెళ్ళయ్యాక శ్రీకూర్మం వెళ్ళి దర్శించుకుని వచ్చాము. మేమే కాదు, పెళ్ళికి వచ్చిన వారిలో చాలామంది వెళ్ళివచ్చారు. తరువాత నాకు తెలిసింది. అరసవల్లి సూర్య భగవానుని గుడికూడా దగ్గరలోనే వుంది. దర్శనం చేసుకుంటే విశేషం అని. ఇంతలో మా ఆడపడుచు భర్త "ఎవ్వరెక్కడికీ వెళ్ళదానికి వీలులేదు. భోజనాలు చేసుకుని మనమంతా వచ్చిన బస్సులో విశాఖపట్నం వెళ్ళాలన్నా"రని మాతో ఎవరో చెప్పారు. కానీ నేను తెగించి మా విశాఖపట్నం తోటికోడలు రాధా కొడుకు దుర్గాప్రసాద్‌తో "ఒరేయ్ నాకీ అవకాశం తప్పితే మళ్ళీ దొరకదురా మనం ముగ్గురం వెళ్ళివద్దాం. అంతగా మన గుడినుంచి వచ్చేసరికి అందరూ వెళ్ళిపోతే మనం వేరే బస్సు ఎక్కైనా వెళదాం. లేకపోతే టాక్సీ చేసుకుని అయినా వెళదామని" అరసవల్లికి ఒక ఆటోరిక్షా రాడానికి, పోవడానికి మాట్లాడుకుని నేనూ, సేతమ్మక్క, మా దుర్గాప్రసాద్ గుడికి వెళ్ళి దర్శనం చేసుకుని తిరిగి శ్రీకాకుళం వచ్చాం. కానీ వచ్చిన తరువాత చూస్తే, ఇంకా ఎవ్వరి భోజనాలు అవ్వనేలేదు. ఎవ్వరూ బయలుదేరనూ లేదు. మాకు గుడిదర్శనం అవ్వడం మంచిదైందని తృప్తిపడ్డాము.

అందుకే ఇలాంటి అవకాశాలు వస్తే ఉన్న టైములోనే అన్నీ జరుపుకోవాలి. ప్రత్యేకంగా వెళ్ళడానికి కుదరదు కదా.

ఇంకో ముఖ్య విషయం, మాలో కల్యాణీలు, రఖుమలు చాలామంది ఉన్నారని చెప్పానుగా, మా చిన్న చెల్లెలు రఖుమతో సహా. పెద్ద రఖుమ యీ ఊళ్ళోనే వుంటోంది. భర్త ప్రకాశం. ఇద్దరి పుట్టింటివాళ్ళ తరపునా నాకు అది, దానికి నేను. బెజవాడలో కల్యాణి అనే మా పెద్దమ్మ కూతురుంది. మా పెద్దమ్మ మచిలీపట్నంలో ఉండేది. ఈ బెజవాడ కల్యాణికి పిల్లలు లేరు. కానీ ఎన్నో సంబంధాలు కుదిర్చి ఎన్నో పెళ్ళిళ్ళు చేయించింది. మా చెల్లెలు రఖుమ రెండో కూతురు కరుణ సంబంధం కూడా అదే ఖాయం చేసింది. కరుణ భర్త పేరు సంజయ్, వాళ్ళకి మూడేళ్ళ కూతురు. పేరు సమీక్ష. సంజయ్ హోటల్ మేనేజ్‌మెంట్ చేసి, స్టార్ హోటల్‌లో ఉద్యోగం, కరుణ బి.కాం పాసయి పది సంవత్సరాలుగా ఐ.సి.ఐ.సి.ఐలో ఉద్యోగం చేస్తోంది. మా చెల్లెలి పెద్దమ్మాయి మృదుల మా ఊళ్ళో ఇంటరు చదివి, రాయ్‌చూర్‌లో బి.కాం పాసయి, పెళ్ళయి అమెరికాకి వెళ్ళి యీ మధ్యనే యిండియాలో సెటిల్ అయ్యారు. భర్త మురళి పెళ్ళికి ముందే అమెరికాలో చేసేవారు. ఇద్దరాడపిల్లలు - మేదిని, మహతి. మ చెల్లెలి మూడవ అమ్మాయి శ్రీలక్ష్మి. భర్త అనిల్, అత్త, మామలతో

బెంగుళూరులో వుంటుంది. ఏడాది పాప. పేరు అశ్రిత. శ్రీలక్ష్మి యస్.బి.సి బ్యాంక్‌లో పెళ్ళికి ముందు చేసి, తరువాత రాజీనామా చేసింది.

సంజయ్ తల్లిదండ్రులను నేను శ్రీలక్ష్మి పెళ్ళిలో కలుసుకున్నప్పుడు వాళ్ళు భువనేశ్వర్ రమ్మని ఆహ్వానించారు. మాకు ఈ లోగా విశాఖపట్నంలో మా ఆడపడుచు రెండో కొడుకు విజయ్ పెళ్ళి వుంటే వారం ముందుగానే భువనేశ్వర్ వెళ్ళి, వచ్చేదారిలో విశాఖపట్నంలో పెళ్ళి చూసుకోవచ్చని ప్రోగ్రాం వేసుకున్నాం. ముందు భువనేశ్వర్ వెళ్ళాం. ఆయన పేరు ఏ.టి.రావుగారు, భార్య జయలక్ష్మి. హోటల్ రూం బుక్ చెయ్యమని మా వారు ఉత్తరం రాస్తే, ఆయన రూం వద్దని తనింట్లో గెస్ట్ రూం వుందని జవాబు రాసారు. మమ్మల్ని చాలా మర్యాద చేసి రిసీవ్ చేసుకున్నారు. నాకు ముందుగా పరిచయం లేకపోయినా, చాలా సంవత్సరాల నుంచి పరిచయం ఉన్న వాళ్ళలాగా చూసుకున్నారు. వాళ్ళిద్దరే స్వయంగా వాళ్ళ కారులోనే భువనేశ్వర్ చుట్టుప్రక్కల ప్రదేశాలకు పిల్చుకెళ్లేవారు. కానీ పూరీ దూరం వలన ఏ.టి.రావుగారు కారు ఆయన డ్రైవింగ్ చేస్తే అలసిపోతారని మా వారు ప్రైవేటు కారు మాట్లాడారు. అక్కడి దేవుడి దర్శనం అయిన తర్వాత వెనకాల వైపుకెళ్ళి చూస్తే వంటశాల. పెద్ద పెద్ద పొయ్యిలు పెట్టి అక్కడే వంటలు చేస్తూ వేడివేడిగా మట్టి కుండలో సప్లై చేస్తుంటారు, డబ్బు తీసుకునే అనుకోండి. అయినా దేవుడు ప్రసాదం ఆవిధంగా దొరకడం ఎంత అదృష్టం. భువనేశ్వర్, కోణార్క్, పూరీ అన్నీ చూపించారు వాళ్ళు. అన్ని చోట్లా చాలా ఫోటోలు తీయించుకున్నాం. భువనేశ్వర్ విడిచి విశాఖపట్నంలో దసపల్లా హోటల్లో రెండు రోజులుండి పెళ్ళి చూసుకున్నాం. ఆ పెళ్ళిలో ఫోటోలు తియ్యాలని మా కెమెరా ఎవరికో యిచ్చాం. విశాఖపట్నంలో మావారి బాబాయిల యిళ్ళకి, మేనత్తకొడుకుల ఇళ్ళకి వెళ్ళి అక్కడ కూడా ఫోటోలు తీయించుకుని విశాఖపట్నం నుంచి మదరాసుకు వచ్చాం. ఇంత వయస్సులో ఈ ట్రిప్పు!

అంతా చాలా ఎంజాయ్ చేసి వచ్చాము.

మర్నాడు ఆ ఫోటోలన్నీ కంప్యూటర్‌లో డౌన్‌లోడ్ చేద్దామని మా మనవడు అనంతు చేస్తే విశాఖపట్నంలోని ఫోటోలు మాత్రం వచ్చాయి. మొత్తం భువనేశ్వర్, కోణార్క్, పూరీ ఏ.టిరావుగారిల్లు ఏవీ రాలేదు. ఎరేస్ అయినా కూడా మెకానిక్ దగ్గరికి తీసుకెళ్తే మళ్ళీ వస్తాయని మా సుధ చెపితే అలాకూడా రాలేదు. రెండు రోజులు నేను తిండితిప్పలు, నిద్రలేకుండా బాధపడ్డానంటే నమ్మండి. మళ్ళీ మళ్ళీ ఆ ప్రదేశాలకి ఈ వయసులో వెళ్ళగలమా? భువనేశ్వర్‌కి ఏ.టిరావుగారు, భార్య జయలక్ష్మిగారితో ఫోన్ చేసి చెపితే, ఆ ఫోటోల కోసరమైనా మళ్ళీ రండి అందామె. ఎన్ని ప్రదేశాలకి వెళ్ళాం, ఎన్నో ఫోటోలు తీసాము. ఇలా ఎన్నడు జరగలేదు. విశాఖపట్నంలో మిడిమిడి జ్ఞానం వాళ్ళెవరో చేసిన పని అది.

ఒక సందర్భాన కాశీ వెళ్ళి వచ్చాము. కాశీకి వెళ్ళి వచ్చిన వాళ్ళు రామేశ్వరం కూడా వెళ్ళి రావాలని చాలామంది చెప్పారు. అందువలన మేమిద్దరం రామేశ్వరం కూడా దర్శనం చేసుకుని వచ్చాం. మాకు దర్శన ఏర్పాట్లు డి.యస్ సుబ్రమణ్యంగారని కమల్‌హాసన్‌గారి పి.ఏ ఎంతైనా సహకరించారు. ఒక మధురై డిస్ట్రిబ్యూటర్ సిఫార్సు కారణంగా మాకు మొత్తం వి.ఐ.పి రెసెప్షన్ ఏర్పాటు చేసారు. అక్కడ ఇరవైరెండు బావులున్నాయి. భక్తులందరికి ఒక్కొక్క బావి దగ్గర ఒక్కొక్క బక్కెట్టు నీళ్ళు తలమీద పోస్తూంటారు. కానీ మేము వి.ఐపీలం కదా, మాకు ఒక్కొక్కళ్ళకి మూడు మూడు బక్కెట్లు స్నానం లభించింది. ఆ తరువాత ఎందుకోసమో మాజీ రాష్ట్రపతి డా.అబ్దుల్ కలాంగారి అన్నగారు ఆ ఊళ్ళోనే వుంటే మమ్మల్ని అక్కడికి కూడా పిల్చుకెళ్ళి పరిచయం చేసారు. ఆయనతో కాసేపు అవీ ఇవీ మాట్లాడి వచ్చేసాం. ఆ సాయంత్రం మధురైలో మా వారి పేరు విన్న ఒక అభిమాని ఇంటికి పిల్చి తర్పణం ఒదిలిన రోజు కనుక హోటల్ వద్దని, మాకు పలహారం వాళ్ళ యింట్లో తయారు చేయించారు.

ఏ.బి.సి.యల్ ప్రొడక్షన్, అంటే అమితాబచ్చన్ నిర్మాణంలో కొన్ని సినిమాలు నిర్మించారు. అందులో ఒక తెలుగు సినిమా ''రాజహంస''. కథ, డైరెక్షన్ మావారే. దానికి షూటింగ్‌కు ముందు కొన్ని లొకేషన్స్ చూడాలి కదా, కెమెరామెన్ ప్రసాద్, ప్రొడక్షన్

మేనేజరు రాజు, అడ్మినిస్ట్రేషన్ సైడ్ తరుణ్ వెళుతుంటే నేనూ వెళ్ళాను. జయపూర్, జోద్‌పూర్, బికనేర్, వారణాసి మొదలైన ప్రదేశాలు అన్నీ చూసాము. నాకా ఊళ్ళన్నీ చూడ్డానికి ఇదే ఛాన్సు. వారణాసి గంగాతీరం అక్కడ జనం చాలా రద్దీగా వుంటారు కదా. తరుణ్ నా పక్కనే వుంటూ, నన్ను చూసుకుంటూ వుండేవారు. నేను మొహమాటంతో "అదేంటి తరుణ్?" అంటే "నాకేం కష్టమండి, మా అమ్మలాంటి వాళ్ళు" అనేవారు. నాకు చాలా సంతోషం అయ్యింది. ఆ ప్రదేశాలు అన్నీ చూడ్డం అయిన తర్వాత వాళ్ళు ముగ్గురూ హైదరాబాదుకు వెళ్ళిపోయారు. ఇంత దూరం వచ్చాం కదా అని నేనూ, మా వారు ఢిల్లీకి వెళ్ళి కొన్నాళ్ళు వున్నాము.

అప్పటికింకా నా మనవడు పుట్టలేదు. ఒకరోజు సుధ, నేను, మా వారు షాపింగ్‌కి వెళ్ళి మధ్యాహ్నం ఇంటికి వచ్చేసరికి మాకొక సర్‌ప్రైజ్. ఇంట్లో కార్తీక్ మాట్లాడుతూ సుప్రసిద్ధ హిందీ గేయ రచయిత జావేద్ అక్తర్, ప్రఖ్యాత సంగీత దర్శకద్వయం జతిన్ - లలిత్. జావేద్ అక్తర్‌తో మా వారికి అప్పటికే పరిచయం. కానీ ఇలా సడన్‌గా ఎందుకు వచ్చారో అర్థం కాలేదు. విషయం ఏమంటే మా వారు ఒక మ్యూజికల్ సబ్జెక్ట్‌ను స్క్రిప్టుగా తయారు చేసి, ఒకసారి జావేద్ అక్తర్‌కి వినిపించారు. అలాంటి స్క్రిప్టు సినిమా ఇంత వరకు ఇండియాలో ఎవ్వరూ తీయలేదు. జావేద్‌గారికి ఇది విపరీతంగా నచ్చింది. దీనికి జతిన్ - లలిత అయితేనే సరైన సంగీత దర్శకులు అని మావారితో చెప్పడం, మావారు సరేననడం జరిగింది. ఆ తరువాత ఈ సబ్జెక్ట్ గురించి బొంబాయిలో అక్కడా, ఇక్కడా పాక్కి చాలామంది సంగీత దర్శకులు ఇది చేయాలని కుతూహలపడ్డాం జావేద్‌గారు విన్నారట. వెంటనే ఫోను చేస్తే, మేము ఢిల్లీలో వున్నామని తెలిసి అదేపనిగా ఫ్లైట్‌లో బొంబాయి నుంచి ఢిల్లీకి వచ్చి, మా వారితో "ఈ సినిమా మేము చేస్తాము" అని మాట తీసుకుని, వెంటనే ఫ్లైట్‌లో బొంబాయికి తిరిగి వెళ్ళిపోయారు. కారణాంతరాల వలన అప్పట్లో ఆ సినిమా చేయడం కుదరలేదు. ఇన్ని సంవత్సరాలకు ఇప్పుడు ఆ ప్రయత్నం జరుగుతోంది. ఇప్పుడు మా వారే దానికి సంగీత దర్శకులు.

కార్తీక్ అప్పటికే టీ పెట్టి వాళ్ళకిచ్చారట. మా సుధ వెళ్ళి గబగబా రెండు మూడు రకాల పళ్ళు కోసి ముక్కలు చేసి వాళ్ళకిచ్చింది. ఇంటి ముందు నిల్చోని, మా సుధ ఇల్లు మేడమీద ఉన్నందువలన కిందకి వచ్చి ఫోటోలు తీసుకున్నాము. మర్నాడే నేనూ, మా వారూ మద్రాసుకు వచ్చేశాము.

మా సుధ పురిటికి వచ్చినప్పుడు అది మదరాసులోనే వున్నప్పుడే మా వారు 'రాజహంస' రష్యాలో పాటలు చిత్రీకరిస్తే బాగుంటుందని, రష్యా వెళ్ళడానికి ముందు ఢిల్లీకి వెళ్ళాము. అక్కడ వెళ్ళగానే మా వారికి జ్వరం వచ్చింది. రష్యాకి వెళ్ళడానికి ఎయిర్‌పోర్టుకు వెళితే, ప్రొడక్షన్ మేనేజర్, కెమెరా ప్రసాదు, మేమిద్దరం కలిపి నలుగురం వుంటే టికెట్లు మూడే వున్నాయని మర్నాడు రమ్మన్నారు. సరేనని రూములకి వచ్చేసాము. మా వారికి జ్వరం ఎక్కువ అయింది. మందులు కూడానే పెట్టుకున్నందువలన క్రోసిన్ ఇచ్చాను. మా అల్లుడికి ఫోన్ చేసి అమ్మా వాళ్ళ దగ్గర వుండే చలి దుస్తులు చాలవని, ఇంకొన్ని వాళ్ళింటినుంచి తెమ్మనమని వాళ్ళాయనకి చెప్పింది. పాపం అతను ఆ సంచి మోసుకొచ్చాడు. తనింటికి రమ్మన్నాడు. చాలా దూరం అయినందున రాలేమన్నాము. అతను మావారికి జ్వరం కదా వదలలేక వదలలేక వెళ్ళిపోయాడు.

ప్రొడక్షన్ వాళ్ళని పిలిచి ఎటూ మూడు టిక్కెట్లు వున్నాయి కదా, మీ ముగ్గురు వెళ్ళి లొకేషన్ చూచిరండి, మాకోసం ఆగవద్దని చెప్పారు. డైరెక్టరు చెప్పారు కదా అని వాళ్ళు సరేనని మా యిద్దరికి మద్రాసుకు తిరుగు ఫ్లైట్ టిక్కెట్లు కొనిచ్చి మర్నాడు వెళ్ళిపోయారు. నా పరిస్థితి మా వారికా జ్వరం. ప్రసాద్, రాజు వెళ్ళిపోయారు. నేనొక్కదాన్నే ఎలా చూసుకుంటానో. మా వారు మంచి నిద్రలో వున్నారు. హోటల్ రూం తలుపు తాళం పెట్టి రోడ్డుకు వచ్చాను. నా ఉద్దేశ్యం కర్పూరం, అగ్గిపెట్టె తెచ్చి మావారికి దిష్టి తీద్దామని. కర్పూరాన్ని హిందీలో ఏమంటారో తెలీదు. పక్క రోడ్డులో కూరగాయల బండి దగ్గర ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు వుంటే చేతితో సైగ చేస్తూ "భగవాన్, హారతి క్యాంఫర్ అని" చెయి తిప్పితే, పక్క వీధిలో కిరాణా కొట్టు వుందని చూపించారు. నేను కర్పూరం కొని వెనక్కి వస్తే, ఏ రోడ్డు నుంచి వచ్చానో మర్చిపోయాను. పోనీ, ఫలానా హోటల్ ఎక్కడ వుందాని అడిగితే ఎవరైనా చెప్తారు కదా. నాకా హోటల్ పేరు

తెలీదు. మా వారు నిద్రలేచి నన్ను వెతుకుతుంటారో ఏమో? భగవంతుడా! ఆ ఢిల్లీ మహానగరంలో నేను ఎలా వెళ్ళను? ఎలా చేరుకోగలను హోటల్‌కి? అంటూ ఎటో తెగించి రెండు వీధులను దాటేసరికి మొత్తం మీద హోటల్ కనిపించింది. హమ్మయ్యా! అనుకుని వెళ్ళాను. కానీ జ్వరం కదా, మా వారు ఇంకా నిద్రపోతునే ఉన్నారు.

ఆ సాయంత్రం మదరాసు ఫ్లైట్. ఎలాగో హోటల్ వాళ్ళ సహాయంతో టాక్సీ మాట్లాడుకుని ఎయిర్‌పోర్టు చేరాము. నేను బోర్డింగ్ కార్డు తీసుకునేంత సేపు మా వారికి నిల్చునే ఓపిక లేదు. బోర్డింగ్ కార్డు తీసుకుని రాగానే, మా వారిక నడవలేక అక్కడ ఆ హాలులోనే కింద పడుకుంటానని పడుకోబోయారు. అదా ఎయిర్‌పోర్టు. అయినా బస్‌స్టాండు లాగావుంది. అసహ్యం, ఇక్కడ పడుకుంటారేమిటి అని మెల్లిగా చేయి పట్టుకుని పిల్చుకెళ్ళి ఆఫీసు స్టాఫ్‌తో "మా వారికి జ్వరం నిలవలేక వున్నారని "ఇంగ్లీషులో మాట్లాడితే, ఆ అమ్మాయి పాపం తన స్టాఫ్ రూంలోకి పిల్చుకెళ్ళి, ఒక సోఫా మీద పడుకోమని చెప్పి పోర్టబుల్ ఫ్యాను ఆయన వైపుకు తిప్పి, పక్కన నాకొక కుర్చీ వేసి కూర్చోమని చెప్పి, "నేను బోర్డింగ్‌కి కాల్ రాగానే పిలుస్తాను. సార్‌కి వీల్ చెయిర్ తెప్పిస్తాను, ఆయన చేత నడిపించవద్దని" వెళ్ళింది. పిలుపు రాగానే ఆ అమ్మాయి వీల్ చైర్ తెప్పించి, నన్ను కూడా ఆయనతో వెళ్ళమని చెప్పి వెళ్ళిపోయింది. ఆ అమ్మాయికి ఎంతైనా కృతజ్ఞతలు చెప్పుకున్నాను. మా వారు జరిగిన సంగతంతా తెలియక జ్వరం మత్తులో వున్నారు.

సరే, ఫ్లైట్ ఎక్కిన తరువాత ఆయన కుర్చోలేకపోయారు. నేను ఎయిర్ హోస్టెస్ దగ్గరకి వెళ్ళి రెండు సీట్లు ఖాళీగా వుంటే చెప్పు నా భర్తకి జ్వరం ఆయన్ని పడుకోబెడతానని చెప్పా. కాసేపు చూసి ఆమె ఎంతకీ రాకపోయేసరికి, మా వారు సీటు పక్కన ఒక సీటు ఖాళీ చేసి, ఇంకొకాయనకి నా సీటు ఇచ్చి ఎలాగో మేనేజ్ చేసి మూడు సీట్లు వరుసగా వున్న చోట చేతి ముంచేతులు మడిచి ఆయన్ని పడుకోబెట్టాను. నాకా భయం రాను రాను ఎక్కువైపోతోంది ఆయనను చూచి. రెండున్నర గంటలు ఎలా గడుస్తుందాని బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాను. మా ఆయన పాటికి ఆయన నిద్రపోతున్నారు. మధ్య మధ్య లేచి ఆయన్ని చూచుకుంటూ కూర్చున్నాను. ఢిల్లీనుంచి బయలుదేరేముందు మా పూర్ణాకు ఫోన్ చేసి కారు పంపేటప్పుడు డ్రైవరు కాక తనని కూడా రమ్మని, అక్కడ కూడా వీల్‌ఛైర్ అరేంజ్ చేయమని చెప్పాను. నాకైతే ఆ ఫ్లైట్‌లో మూడు గంటలు మూడు యుగాలుగా గడిచాయి.

మద్రాసు ఎయిర్‌పోర్టు వచ్చేసరికి నాకు సగం ప్రాణం లేచి వచ్చినట్లయింది. మా పూర్ణను చూడగానే బండ దింపినట్లైంది. ఇల్లు చేరగానే మా ఫ్యామిలీ డాక్టర్ త్యాగరాజ్ గారిని ఇంటికి పిలిపిస్తే, ఆయనొక ఇంజెక్షన్ ఇచ్చి కొన్ని మందులు రాసిచ్చారు. మర్నాడు జ్వరం తగ్గిపోయింది.

కొన్నాళ్ళకి రష్యా వెళ్ళిన వాళ్ళు మద్రాసు వచ్చి "మీరు రాకపోవడం మంచిదైంది. ఇండియానుంచి వచ్చిన వాళ్ళల్లో ఎవరికి ఒంట్లో బాగోలేకపోయినా వాళ్ళ ఊళ్ళోకి వదలడం లేద"న్నారు. పైగా విపరీతమైన గాలి, దుమ్మట. సరైన భోజన వసతి లేదట. మూడు రోజుల్లో తిరిగి రావాలనుకున్న వారికి రిటర్న్ టిక్కెట్టు దొరక్క మరొక వారం రోజులు వుండాల్సి వచ్చింది. మా వారికి ఇలా జ్వరం రావడం అదృష్టమేమో అనుకున్నా. ఇంతా చేసి రాజహంస షూటింగ్ రష్యాకాదు కదా, ఏ ఇతర దేశాలలోనూ జరగలేదు. మా వారి అసోసియేట్ పి. సాంబశివరావు వెళ్ళి ఊటీలోనే పాటల చిత్రీకరణ చేయించి వచ్చాడు.

మా వారి సినిమాల్లో కొన్ని ఇంటర్ నేషనల్ ఫిలిమ్స్ ఫెస్టివల్స్‌కి, ఇండియన్ పెనోరమాకి సెలెక్ట్ అయి, అవి ఫెస్టివల్స్‌లో ప్రదర్శింపబడేవి. అలాంటప్పుడు మా వారి ఫ్లైట్ ఖర్చులు రానూపోనూ, హోటల్ ఖర్చులు అన్నీ ఫెస్టివల్ డైరెక్టరేట్ భరిస్తుంది. అలాంటప్పుడు నా ఖర్చు నే పెట్టుకుని వెళ్ళేవాళ్ళం. అలాగే ఒక సంవత్సరం మయూరి సినిమా సెలక్ట్ అయింది. మేమిద్దరం వెళ్ళి హైదరాబాదులో వున్న హోటల్ సంపూర్ణాలో దిగాము. నాలుగురోజులక్రితమే మా మేనమామ చనిపోతే, ఊళ్ళోకి వచ్చాము కదా అని మా అత్తని పరామర్శించడానికి వెళ్ళాం. వచ్చి స్నానం చేసి 6గంటలకి సినిమాకి వెళ్ళి, రాత్రి వచ్చి పడుకున్నాం. మర్నాడు పొద్దునే స్నానం చేసి 8.30గంటలకి టిఫెన్ తిని సినిమా థియేటరుకి వెళ్ళాము. మా యిద్దరికీ డెలిగేట్ కార్డ్సు యిస్తారు. లోపలికి వెళ్ళడానికి పర్మిషన్. దాంట్లో

మా ఫోటోలు ఉంటాయి. మధ్యాహ్నం రోజూలాగే 1.30గంటలకి హోటలు కొచ్చి రిసెప్షన్‌లో తాళాలడిగితే, మీ రూము తెరిచేవుంది. లోపల ఎవరైనా ఉన్నారేమోనని బెల్ నొక్కాం, రెస్పాన్స్ రాలేదు. రిసెప్షన్‌లో అడిగితే పైనే ఉండాలే తాళాలు అన్నారు. అలా పైకి కిందికి తిరిగాం. మా వారు రిసెప్షన్‌లో కేకలేస్తూ గట్టిగా అడిగేసరికి వాళ్ళు డూప్లికేట్ తాళాలిచ్చారు. బట్టలు మారుద్దామని మావారిని తాళాలడిగి, పెట్టె తాళం తీద్దామని చూస్తే పెట్టె తీసే వుంది. "అరే! మీరప్పుడే తాళం తీసేశారేంటి? మరి మళ్ళీ నాకు తాళాలిచ్చారే అనడిగితే, "లేదే నీకేగా యిచ్చాను తాళాలు"? అన్నారు. నాకు అనుమానం వచ్చి చూస్తే పెట్టెలోని బట్టలు కెలికి ఉన్నాయి. మేం దాచుకున్న రూ.5000/- మా వారి కొత్త షర్టు కనిపించలేదు. మళ్ళీ అంతా వెతికాం. ఇది ఇరవై ఏళ్ళ క్రితం మాట. ఆ రోజుల్లో అయిదువేలంటే మాటలా! మా వారి పర్సులో ఉన్న పాకెట్ మనీ తప్పితే మరే డబ్బూలేదు. వెంటనే హోటల్ మేనేజ్‌మెంట్‌కి చెప్తే, ఎక్కడో పొరపాటు జరిగిందని, పోలీసు కంప్లైయింట్ ఇవ్వద్దనీ, యిస్తే వాళ్ళ హోటల్ పేరు పోతుందని బతిమాలుకున్నారు. నా పాటికి నేను ఏడుస్తూనే ఉన్నాను. మెనేజ్‌మెంట్ వాళ్ళు మా రూము కొచ్చినప్పుడు, ఏటేటా ఇలా అన్ని ఊళ్ళకి వెళ్తుంటామని, ఇలా ఎప్పుడూ జరగలేదని చెపితే వాళ్ళు చెప్పినది ఒకటే "సారీ అండీ! పొరపాటయిందండీ" అని. ఏడవడం కాకపోతే నాకు చేతనైంది ఏముంది? ఆ సమయంలో.

కానీ ఈ విషయం ఎలా పొక్కిందో తెలీదు. మర్నాడు తెలుగు పేపర్లో పడింది. "సింగీతం శ్రీనివాసరావుగారి డబ్బు హోటల్ సంపూర్ణాలో చోరీ జరిగింది" అని. అప్పటికే అమెరికా అబ్బాయి సినిమా మా వారిని డైరెక్ట్ చెయ్యమని దుక్కిపాటి మధుసూధనరావుగారు మాట్లాడారు. ఆయన పేపరు చూసి డబ్బు అవసరమైతే తానిస్తానని ఫోన్ చేశారు. ఇలాగ యిద్దరు ముగ్గురు చేశారు. కానీ మా వారు ఎవ్వరి దగ్గరా తీసుకోలేదు. ఒద్దన్నారే గాని మళ్ళీ మేం వెనక్కి వెళ్ళడానికి ఫ్లైట్ ఖర్చులెలా? ఆ సమయంలో మా అమ్మా, నాన్నగారు హైదరాబాదులోనే ఉండేవారు. మా నాన్నగారి వద్ద నుంచి అయిదువేల రూపాయలు తీసుకుని మదరాసు వచ్చేశాము. చూడండి ఆ స్టార్ హోటల్ పేరు గొప్ప, ఊరు దిబ్బలా తయారైంది.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments